క్లుప్తంగా

చిన్నారులందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

టంగుటూరు: చిన్నారులందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తూర్పు నాయుడు పాలెం క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు ఎన్వీ సుధారాణి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. సురేష్ రెడ్డి, శ్రీనివాసులు, మాధురి, జ్యోతి, శారద విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మంచి లాభాలు



పొన్నలూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

పొన్నలూరు: ప్రకృతి వ్యవసాయంతో పంటలు అధిక దిగుబడి వచ్చి రైతులు మంచి లాభాలు పొందవచ్చని మాస్టర్ ట్రైనర్ బి.ఎస్తేరమ్మ అన్నారు. పొన్నలూరులో సోమవారం ప్రకృతి వ్యవసాయం, పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలకు మంచి గిరాకీ ఉందన్నారు. తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ సుజాత, ఎల్‌టీ మందాకిని, అనుమోలు సాంబయ్య, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దళితుల గ్రామ బహిష్కరణ సిగ్గుచేటు

టంగుటూరు: దళితుల గ్రామ బహిష్కరణ అనాగరికమైన చర్య అని, దీనిపై చర్యలు తీసుకొని నిందితులను కఠినంగా శిక్షించాలని మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లం గ్రామంలో దళితులపై గ్రామ బహిష్కరణ విధిస్తూ అగ్రవర్ణాల పెద్దలు నిర్ణయించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

వెంకుపాలెంలో అభివృద్ధి పనులు చేపడతాం



వెంకుపాలెంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుజాత

పొన్నలూరు: మండలంలోని వెంకుపాలెంలో అభివృద్ధి పనులు చేపట్టి మౌలిక వసతులు కల్పిస్తామని ఎంపీడీఓ డాక్టర్ సుజాత అన్నారు. సోమవారం గ్రామంలో పర్యటించి నూతనంగా నిర్మిస్తున్న నీటి తొట్టెలను పరిశీలించడంతో పాటు పలు అంశాలపై గ్రామస్తులతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించి, గ్రామస్తుల విన్నపం మేరకు మురుగు నీరు బయటకు పోయే విధంగా సైడ్ కాలువలు నిర్మిస్తామన్నారు. గ్రామంలో నిర్మిస్తున్న నీటి తొట్టెలను పశుపోషకులు వినియోగించుకోవాలన్నారు. ఏపీఓ సుధాకర్, టీఏ అనిల్, తానికొండ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పామూరు: కారు ఢీకొని గాయాలపాలైన మోటార్‌సైక్లిస్ట్ ఒంగోలు రిమ్స్‌వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. వివరాలు... సీఎస్‌పురం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన మందా శ్రీనివాసులు ఆదివారం మోటార్‌బైక్‌పై పామూరు వస్తుండగా సీఎస్‌పురంరోడ్డు 167బి జాతీయ రహదారి జంక్షన్ రోడ్డును కుడివైపు నుంచి ఎడమవైపుకు క్రాస్‌చేస్తుండగా పామూరు నుంచి సీఎస్‌పురం వైపుకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఘటనలో మందా శ్రీనివాసులు తలకు గాయాలు కాగా కందుకూరు అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు.

రయ్‌మని రైలెక్కిన.. సర్వేయర్లు

- రైలు వేళలే పనివేళలుగా మార్చుకున్న వైనం
- మధ్యాహ్నం 2.30 గంటలకే వెళ్లిపోయిన సర్వేయర్లు
- రైతుల ఇబ్బందులు



ఖాళీగా ఉన్న సర్వేయర్ల రూమ్



మధ్యాహ్నం 2.30 ప్యాసింజర్‌కు వెళ్తున్న సర్వేయర్లు

ఉలవపాడు: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ల పనితీరు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని రైతులు వాపోతున్నారు. ఉలవపాడు మండలపరిధిలో 16 సచివాలయాలు ఉండగా అందులో 16 మంది సర్వేయర్లు, మండల సర్వేయరు ఉన్నారు. ఇందులో ఇద్దరు మెటర్నిటీ లీవ్‌లో ఉండగా మిగిలిన వారు పనిచేస్తున్నారు. కానీ వీరిలో అధిక శాతం మంది బయట నుండే వస్తున్నారు. వీరు సమయపాలన పాటించకుండా రైలు వేళలే తమ పనివేళలుగా ఉంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఉలవపాడు కుచెందిన కొందరు రైతులు సర్వేయర్లతో పని మీద వచ్చారు. వచ్చి సర్వేయర్ల రూమ్‌లో చూడడంతో కేవలం ఒక్కరే ఉండడం గమనించారు. తమకు అవసరమైన సర్వేయర్లు ఎక్కడికి వెళ్లారు అని అడగగా రేపు రావాలని అక్కడ ఉన్నవారుచెప్పడంతో వారు అవాక్కయ్యారు. స్థబూనికంగా ఆరా తీసి వారు మధ్యాహ్నం 2.30కు ఉలవపాడు నుంచి ఒంగోలు వెళ్లే రైలుకు ఒంగోలు వెళ్తారని తెలుసుకున్నారు. రైల్వే స్టేషన్ వద్దకు వెళ్లి వారు ఆఫీస్ సమయంలో ఇలా ఇళ్లకు వెళ్లిపోతున్నారని ఫోటోలు తీసి పత్రికలకు సమాచారం అందించారు. ఇలా అధిక శాతం సర్వేయర్లు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని రైతులు వాపోతున్నారు.

ఫీల్డ్ వర్క్ పేరుతో..

సర్వేయర్లు తమకున్న పని ఆధారంగా ఎగనామం పెట్టడానికి అవకాశం ఉంది. ఫీల్డ్ వర్క్ ఉంటుంది కాబట్టి కార్యాలయంలో ఉండాల్సిన అవసరం లేదు. ఎవరైనా ఉన్నతాధికారులు అడిగితే తాము ఫీల్డ్‌లో ఉన్నామని చెప్తున్నారని కానీ అక్కడ ఉండకుండా ఇండ్లకు వెళ్లిపోతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గతం ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగులపై కచ్చితమైన నిఘా ఉండి ప్రజలకు ఉపయోగకరంగా పని చేయించేవారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం సచివాలయాలను పట్టించుకోకపోవడం వలన వారు కూడా నచ్చితే పనిచేయడం తప్ప బాధ్యతగా పనిచేయడంలేదని రైతులు అంటున్నారు. ఇక ఉలవపాడు మండల పరిధిలో నివాసం ఉంటున్న కొందరు సర్వేయర్లు ఇంటి వద్ద ఉండి కూడా అటు కార్యాలయానికి కానీ, ఇటు ఫీల్డ్ వర్క్‌కు వెళ్లకుండా పనిచేస్తున్నారని రైతులు వాపోతున్నారు. నెలల తరబడి తమను సర్వేలు చేయకుండా తిప్పుకుంటున్నారని వాపోతున్నారు. ఈవిషయమై మండల సర్వేయర్ ఖాదర్‌హుస్సేన్‌ను వివరణ కోరగా తాను మధ్యాహ్నం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చానని, ఈ విషయాన్ని పరిశీలించి సర్వేయర్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తామని తెలియజేశారు.

ఉపాధి పనుల ఆకస్మిక తనిఖీ



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న పీడీ జోసెఫ్ కుమార్

టంగుటూరు: మండలంలోని మల్లవరపాడు గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పీడీ జోసెఫ్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో పనులకు హాజరై కూలీలతో నేరుగా మాట్లాడారు. కూలి ఎంత గిట్టుబాటవుతుంది, ఎంత సమయం పని చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పనిచేస్తే రూ.240 వరకు కూలి గిట్టుబాటవుతుందని కూలీలు తెలిపారు. మరికొంత అదనంగా పనిచేస్తే రూ.300 కూలి వస్తుందని తెలిపారు. ప్రతి 200 మంది కూలీలకు తాగునీరు అందించేందుకు ప్రత్యేకంగా మనిషిని ఏర్పాటుచేసినట్లు ఏపీఓ వివరించారు. అనంతరం ఇటీవల నిర్మించిన పశువుల తొట్లను పరిశీలించారు ఆయన వెంట టంగుటూరి ఎంపీడీఓ దేవసేన కుమారి,సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులపై ప్రజాప్రతినిధుల ధ్వజం

- జలజీవన్ మిషన్ పనులు చేయకుండానే పైపులు అమ్ముకున్నారు
- తాగునీటి సమస్యపై సభ్యుల ఆగ్రహం



తాగునీటి సమస్యపై అధికారులను నిలదీస్తున్న సభ్యులు

హనుమంతునిపాడు: గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదని సర్వ సభ్య సమావేశంలో అధికారులపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు ఉడుముల వెంకటసుబ్బారెడ్డి జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ పైపులైన్లకు వచ్చిన పైపులు ఏమయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్‌ను నిలదీశారు. పనులు చేయకుండానే అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి సొమ్ము దోచుకున్నారని ఆరోపించారు. మండలానికి 10 రోజుల నుంచి సాగర్ జలాల సరఫరా నిలిచిపోయిందని, పైపుల మరమ్మతులు చేసి తాగునీరు వెంటనే సరఫరా చేయాలని కోరారు. కరువు మండలాల జాబితాలో మండలం ఎందుకు నమోదు కాలేదని వ్యవసాయాధికారులను ప్రశ్నించారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు మార్చాలని హాజీపురం సర్పంచ్ తిరుపతిరెడ్డి ఏఈని కోరారు. హనుమంతాపురం గ్రామ పంచాయతీలో జాబ్ కార్డు ఉండి అర్హులైన ఉపాధి కూలీలకు పని కల్పించడం లేదని, ఒక వర్గం వారికే పనులు కల్పిస్తున్నారని సర్పంచ్ సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్‌కి తెలియకుండా అధికార పార్టీ నేతలు పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. వేసవిల్లో నీటి తొట్లు ఉపయోగం ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సర్పంచులు కోరారు. హాజీపురంలో పశువులకు మెదడు వాపు వ్యాధి సోకి మృత్యువాత పడుతున్నాయని, నివారణకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.

అధికారులు ప్రోటోకాల్ పాటించాలి:

ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు అధికారులు తప్పనసరిగా ప్రోటోకాల్ పాటించాలని ఎంపీపీ గాయం సావిత్రి అన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలి. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా వేసవిలో అన్ని చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ప్రజాప్రతినిధులను ఆహ్వానించకుండా గ్రామసభలు, సమావేశాలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. స్త్రీ నిధి రుణాలు రికవరీ చేయని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎల్‌డీఓ డి.శ్రీనివాసులరెడ్డి, డీఎస్‌పీఓ హనుమంతరావు, డీటీ కిషోర్‌కుమార్, ఏఓ రమణ, ఏఈ శ్రీకాంత్, ఎంఈఓ రమణయ్య, పీఆర్ ఏఈ బ్రహ్మయ్య, డాక్టర్ సందీప్, పశు వైద్యులు రాజశేఖర్‌రెడ్డి, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు

పొగాకు కనిష్ట ధర రూ.225



వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో కనిష్ట ధర రూ.225 పలికిందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. క్లస్టర్ పరిధిలోని ఆలకూరపాడు, రావివారిపాలెం, పాలేటిపాడు, జయవరం గ్రామాలకు చెందిన రైతులు 805 బేళ్లను వేలానికి తీసుకురాగా 653 బేళ్లను కొనుగోలు చేసి వివిధ కారణాలతో 152 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, సరాసరి ధర రూ.262.53గా నమోదైంది. వేలంలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నుంచి మూడో రౌండ్ పొగాకు వేలం ప్రారంభమైంది. సోమవారం నిర్వహించిన వేలంలో పొగాకు కనిష్ట ధర రూ.225 పలికిందని ఇన్‌చార్జి క్లస్ అధికారి శివకుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని అయ్యవారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం, జువ్విగుంట గ్రామాలకు చెందిన రైతులు 873 బేళ్లను వేలానికి తీసుకురాగా 621 బేళ్లను కొనుగోలు చేసి 252 బేళ్లను తిరస్కరించారు. సరాసరి ధర రూ.257.69గా నమోదైంది. వేలంలో 17 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. వేలాన్ని బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య పరిశీలించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..



పొన్నలూరులో సెంటర్‌ని పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

పొన్నలూరు: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో 'పోషణ్ పక్వాడా' సక్రమంగా నిర్వహించడం లేదు. దీనిపై సోమవారం సాక్షి దినపత్రికలో 'మొక్కుబడి తంతు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఐసీడీఎస్ ఉన్నతాధికారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని పరిశీలించాలని ఆదేశించారు. దీంతో సూపర్‌వైజర్ రమాదేవి సోమవారం మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి పోషన్ పక్వాడా కార్యక్రమాన్ని పరిశీలించారు. నిర్లక్ష్యం వహించకుండా పౌష్టికాహార వారోత్సవాలను సక్రమంగా నిర్వహించాలని అంగన్‌వాడీలను హెచ్చరించారు. పొన్నలూరులో ఇంటింటికి తిరిగి బాలింతలు, గర్భిణులతో మాట్లాడి పౌష్టికాహారం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.

పొదుపు నిధుల గోల్‌మాల్‌పై ఫిర్యాదు



వీఓఏపై ఏపీఎంకు ఫిర్యాదు చేస్తున్న పొదుపు సంఘాల మహిళలు

రూ.23.90 లక్షల అక్రమాలంటూ ఆరోపణలు

పామూరు: పొదుపు సభ్యులు సీసీఎల్‌లోన్ నిధులు గోల్‌మాల్ జరిగాయంటూ ఏపీఎం గంటా విద్యాసాగర్‌కు మండలంలోని గోపాలపురంగ్రామానికి చెందిన 9 గ్రూపుల సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపాలపురం గ్రామానికి చెందిన పొదుపు మహిళలు మాట్లాడుతూ వీఓఏ పల్లాపు బేబి తమకు తెలియకుండా లోన్ పేరుతో నగదు కాజేసి ఉడాయించిందన్నారు. 2023లో అదనపు రుణాలు ఇప్పిస్తానని సంతకాలు చేయించుకున్నారని, వాటిని అడ్డుపెట్టి అక్రమాలకు పాల్పడి రూ.23.90 లక్షలు కాజేశారని ఆరోపించారు. కాగా ఏపీఎం, సీసీల సంతకాలు లేకుండానే బ్యాంకు వారు అదనపు రుణాలు మంజూరుచేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఏపీఎంను వివరణ కోరగా 9 గ్రూపులకు చెందిన సభ్యులు ఫిర్యాదు చేశారని, బ్యాంకుస్టేట్‌మెంట్‌లు తీసుకుని పరిశీలిస్తున్నామన్నారు. దీనిపై పూర్తి నివేదికను జిల్లా అధికారులకు పంపుతామన్నారు. ఇదిలాఉంటే వీఓఏ అందుబాటులో లేకపోవడంతో ఆరోపణలకు బలం చేకూరుతోంది. స్త్రీ నిధి రుణాల్లో కూడా పెద్ద ఎత్తున్న అక్రమాలు జరిగినట్లు, ఒకరి చెల్లింపులు మరొకరికి జమచేసి విషయం బట్టబయలైన తరువాత వాటిని సరిచేయడం కూడా జరుగుతోందని ఆరోపణలు ఉన్నాయి.

ఐరన్ లోపంతో రక్తహీనత



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ విక్టోరియారాణి

కొండపి: ఐరన్ లోపం రక్తహీనత సమస్యకు దారితీస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విక్టోరియా రాణి అన్నారు. పోషణ పక్వాడ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వెన్నూరు అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగే పిల్లల్లో ఐరన్ శాతం తగ్గితే చికాకుగా ఉండడంతో పాటు దేనిపై ఏకాగ్రత పెట్టలేరని, జ్ఞాపక శక్తి మందగిస్తుందని తద్వారా చదువులోనూ వెనకబడే అవకాశం ఉంటుందన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అరికట్టవచ్చని తెలిపారు. అనంతరం చిన్నపిల్లలకు బరువు, ఎత్తు కొలతలను తీసుకొని గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.

పామూరు: గర్భిణులు సమతుల్య ఆహారం తీసుకోవడంద్వారా శిశువు ఆరోగ్యంగా జన్మిస్తారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. మండలంలోని రావిగుంటపల్లె అంగన్‌వాడీ కేంద్రంనందు సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పోషకాహార లోగోను ప్రదర్శించి పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్‌లో వసతులు కల్పించాలి



డీఈఈకి వినతి పత్రం అందచేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: జగనన్న లే అవుట్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సోమవారం హౌసింగ్ డీఈఈ కోటిరెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ జగనన్న లే అవుట్ కాలనీలో దాదాపు 1300 మందికి పట్టాలు ఇచ్చారని, సుమారు 300 మందికి పైగా గృహనిర్మాణాలు చేసుకున్నట్లు తెలిపారు. లే అవుట్ కాలనీలో కనీస నీటి సౌకర్యం, రోడ్డు వసతి, రోడ్ల మరమ్మతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. తీసుకోవాలన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగించాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని అన్ని ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా స్థాయి తగ్గింపు చేయడం అన్యాయమని సత్వరం అధికారులు స్పందించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాయబ్‌రసూల్, మండల అధ్యక్ష, కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్ బాబు అన్నారు. యూపీ పాఠశాలలు కొనసాగించాలని కోరుతూ స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ జె.ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో మారుమూల ప్రాంతమైన సీఎస్‌పురం మండలంలోని పాఠశాలల స్థాయిని తగ్గిస్తే విద్యార్థులు డ్రాపౌట్స్ అయ్యే అకాశం ఉందని, దీన్ని అధికారులు గుర్తించి పాఠశాలలు కొనసాగించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు మాలకొండయ్య, సుబ్బరాయుడు, రామకృష్ణ పలువురు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.3.42 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామివారి ఆలయానికి ఆదివారం రూ.3,42,786 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్. నరసింహబాబు తెలిపారు. దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.67,670, లడ్డుప్రసాదాల అమ్మకంద్వారా రూ.22,915, ఆలయంవద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.1,63,409 పంచామృతాభిషేకానికి విరాళంగా రూ.60,676 వచ్చినట్లు తెలిపారు. మహాప్రాకార నిర్మాణానికి రూ.25,116, ఇతర విరాళాలకింద రు.3 వేలు విరాళం వచ్చినట్లు వారు తెలిపారు. అన్నదానానికి తిరుపతిజిల్లా గూడూరుకు చెందిన పాబోలు నారాయణ, విజయలక్ష్మి దంపతులు రూ.1,00,016 విరాళం అందజేసినట్లు చైర్మన్, ఈఓ తెలిపారు.

కోదండరామస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు



సీతారాములకు ప్రత్యేక పూజలు



అలరించిన మహిళల కోలాటం

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని కోదండరామస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా స్వామి 16 రోజుల పండుగ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. సీతారాముల వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు ప్రదర్శించిన కోలాట కార్యక్రమం అందరినీ అలరించింది. అనంతరం అన్నదానం చేశారు.

జనావాసాల మధ్య మద్యం షాపు పెట్టొద్దు..

- ఐద్వా ఆధ్వర్యంలో మహిళల నిరసన, తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

కనిగిరిరూరల్: పట్టణంలోని గార్లపేట రోడ్డులో మద్యం షాపును ఏర్పాటు చేయవద్దంటూ ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు సోమవారం నిరసన తెలిపి అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి మాట్లాడుతూ పేదలు, కార్మికులు నివసించే ఏరియాల్లో, ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు ఉన్న చోట మద్యం షాపులు ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. పేదలు నివసించే గార్లపేట రోడ్డు ఏరియాల్లో మద్యం షాపులు పెట్టడం వల్ల పేదల జీవన విధానం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఎస్‌కే బషీరా, ప్రసన్న, సీఐటీయూ నాయకులు నరేంద్ర,స్థానికులు శ్రీనివాసులు, మల్లయ్య, గంగులు, కిషోర్, బాల గురవయ్య పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

పొన్నలూరు: మండలంలోని రావులకొల్లు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురు జూదరులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై అనూక్ సిబ్బందితో దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ.21,570 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ కండక్టర్‌కి గుండెపోటు

- సీపీఆర్ చేసి బతికించిన ప్రయాణికులు



కండక్టర్ లక్ష్మికి సీపీఆర్ చేస్తున్న ప్రయాణికులు

పొన్నలూరు: విధుల్లో ఉన్న కండక్టర్‌కి ఒక్కసారిగా గుండెపోటు రావడంతో బస్సులో ఉన్న ప్రయాణికులు సీపీఆర్ చేసి బతికించిన ఘటన సోమవారం ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం ముత్తరాసుపాలెం సమీపంలో జరిగింది. ప్రయాణికుల కథనం ప్రకారం.. కనిగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కందుకూరులో ప్రయాణికులను ఎక్కించుకొని కనిగిరికి బయలుదేరింది. మార్గంమధ్యలో పొన్నలూరు మండలం ముత్తరాసుపాలెం సమీపంలోకి రాగానే కండక్టర్ ఏపీఎస్ లక్ష్మి గుండెపోటుకు గురై ఒక్కసారిగా సీటులో కుప్పకూలిపోయారు. గమనించిన ప్రయాణికులు వెంటనే లక్ష్మికి సీపీఆర్ చేశారు.

దీంతో ఆమె స్పృహలోకి వచ్చారు. బస్సు డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి బస్సును నేరుగా పొన్నలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. పీహెచ్‌సీ సిబ్బంది ఆమెకు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్సులో కనిగిరికి తరలించారు. చాకచక్యంగా వ్యవహరించి సీపీఆర్ చేసి కండక్టర్ లక్ష్మిని బతికించిన ప్రయాణికులను అధికారులు అభినందించారు.